ప్రజల చేతిలో

www.ayudamdaily.com

# ఆయుధం

The Common People's Voice

మంగళవారం | సెప్టెంబరు 29, 2026 | సంపుటి : 7 | సంచిక : 101 | పేజీలు : 2





## ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ

- గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, ఆయుధం:** ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు తెలంగాణ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. సెప్టెంబర్ 26వ తేదీతో అసెంబ్లీ కార్యదర్శి తిరుపతి గెజిట్ జారీ చేశారు. బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి ఎన్నికై కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన దానం నాగేందర్‌పై ఇటీవల హైకోర్టు అనర్హత వేటు వేసిన సంగతి తెలిసిందే. 2024 ఏప్రిల్ 23 నుంచి అనర్హత అమల్లోకి వచ్చినట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో ఈ స్థానం అప్పటి నుంచి ఖాళీ అయినట్లు గెజిట్ జారీ అయ్యింది.

## గురుకులాల్లో విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత

- కలెక్టర్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి
- ఉపాధ్యాయులు–విద్యార్థుల హాజరు, మౌలిక వసతులపై దృష్టి
- ఫుడ్ పాయిజనింగ్, ఎలుకలు, పాముకాటు ఘటనలు పునరావృతం కావొద్దు
- దసరా నాటికి రెండు జతల యూనిఫారాలు అందేలా చర్యలు
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

**హైదరాబాద్, ఆయుధం:** రాష్ట్రంలోని పాఠశాల విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల పరిధిలోని అన్ని రెసిడెన్షియల్ విద్యాసంస్థలను పటిష్టంగా పర్యవేక్షిస్తూ, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.



2 లో

## సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను అరెస్టు చేయాలి

- ఓటు హక్కును దెబ్బతీసే ప్రయత్నాలను సహించం
- ఓటు చోరీపై కాంగ్రెస్ పోరాటం ఇప్పటితో ఆగదు
- బీజేపీని వరంగల్‌లో అడుగుపెట్టనివ్వం
- వరంగల్ అభివృద్ధిపై కేంద్రంతో నిరంతర పోరాటం
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య





**హనుమకొండ, ఆయుధం:** ఓటర్ల జాబితాలో అక్రమ మార్పులకు పాల్పడిన సి ఈ సి జ్ఞానేశ్ కుమార్ ను వెంటనే అరెస్ట్ చేయాలని వరంగల్ ఎంపీ, డా.కడియం కావ్య డిమాండ్ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘంలో SIR లో జరిగిన "ఓటు చోరీ" అక్రమాలకు వ్యతిరేకంగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన భారీ నిరసన చేపట్టారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి పాల్గొన్నారు. ఓటర్ల జాబితాలో అక్రమ మార్పులకు పాల్పడిన సి ఈ సి జ్ఞానేశ్ కుమార్ ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ఆడిటోరియం నుంచి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య భారీ ర్యాలీతో హనుమకొండ కలెక్టరేట్ వరకు తరలివచ్చారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా సవరణ పేరుతో ప్రజల ఓటు హక్కును దెబ్బతీసే ప్రయత్నాలను సహించేది లేదని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. 'ఓటు చోరీ'పై కాంగ్రెస్ పోరాటం ఇప్పటితో ఆగదని, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసం నిరంతరం కొనసాగుతుందని అన్నారు. బీజేపీ రాజకీయంగా వరంగల్‌లో అడుగుపెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలను కాంగ్రెస్ కార్యకర్తలు సమష్టిగా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు..

ఇప్పుడిప్పుడే చిన్న చిన్న పిల్లి పిల్లల్లా బయటకు వచ్చి కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తున్నవారిని అడ్డుకుందాం'' అంటూ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ రెండున్నరేళ్లుగా పోరాటం చేస్తున్నారని ఎంపీ డా.కడియం కావ్య పేర్కొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఓటర్ల జాబితా, ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ ప్రశ్నలు లేవనెత్తుతోందని చెప్పారు.

గతంలో వరంగల్ అభివృద్ధికి బీజేపీ చేసిందేమీ లేదని ఎంపీ విమర్శించారు. మామునూరు విమానాశ్రయం, ఓఆర్ఆర్, కోచ్ ఫ్యాక్టరీ వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో నిరంతరం పోరాడుతోందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రులను కలిసి వరంగల్ అభివృద్ధి అంశాలను ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు. 2029లో రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిగా చూడాలంటే ఇప్పటి నుంచే కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఎంపీ అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, డివిజన్, మండల అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, ఆర్‌జీపీఆర్ఎస్ నాయకులు, విద్యార్థి, యువజన విభాగాల ప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు, పాల్గొన్నారు.





## వీవర్స్ భవనంలో యోగా సెంటర్ నిర్మాణానికి రూ.25 లక్షలు

- జీడబ్ల్యూఎంసీ నుంచి అదనపు నిధుల హామీ
- ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి,
- ప్రొఫెసర్ కూరపాటి సన్మాన సభలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- నిధుల వరంతో సభలో హర్షా తిరేకాలు

**హన్మకొండ, ఆయుధం:** హన్మకొండ హంటర్ రోడ్డులోని 'ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డ్' భవన ప్రాంగణంలో నూతనంగా నిర్మించతలపెట్టిన యోగా సెంటర్‌కు నియోజకవర్గ అభివృద్ధి నిధుల (సీడీఎఫ్) నుంచి రూ. 25 లక్షలు మంజూరు చేస్తున్నట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రకటించారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలు, తెలంగాణ తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ ఆత్మీయ సన్మాన సభ ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సంయుక్త కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, ట్రస్ట్ బోర్డు చైర్మన్ వన్నాల శ్రీరాములు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరయ్యారు.

ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రాంగణంలో ప్రజా ప్రయోజనార్థం యోగా సెంటర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని చైర్మన్ వన్నాల శ్రీరాములు ఎమ్మెల్యేకు నాయిని రాజేందర్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. దీనిపై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి.. తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ.25 లక్షలు కేటాయిస్తున్నట్లు సభాముఖంగా వెల్లడించారు. అంతేకాకుండా, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) నిధుల నుంచి కూడా మరిన్ని నిధులు సమకూరుస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వరాల జల్లు కురిపించడంతో సభా ప్రాంగణంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే మలిదశ ఉద్యమంలో, విద్యా రంగ పరిరక్షణలో కీలక పాత్ర పోషించి తెలుగు అకాడమీ చైర్మన్‌గా నియమితులైన ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ సేవలను కొనియాడారు. విద్య, సంక్షేమం, ఆరోగ్య రంగాల అభివృద్ధికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని, చేనేత వర్గాల సంక్షేమానికి తమ వంతు సహకారం నిరంతరం ఉంటుందని తెలిపారు. ముందుగా ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డు డైరెక్టర్, తెలంగాణ ఆన్‌లైన్ మీడియా వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి వేముల సదానందం నేత స్వాగతోపన్యాసం చేస్తూ ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ ఉద్యమ ప్రస్థానాన్ని వివరించారు. అనంతరం ప్రొఫెసర్ కూరపాటిని ట్రస్ట్ ప్రతినిధులు, ప్రముఖులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేర సంఘం కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ సంఘ వెంకట్రాజం, కమలాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీరవీందర్, ఉమ్మడి వరంగల్ జడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు, భారతీయ జనతా పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ, పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, ట్రస్ట్ బోర్డ్ ప్రధాన కార్యదర్శి దాసరి ప్రేమ సాగర్, టీయూడబ్ల్యూజెఐజేయూ హన్మకొండ జిల్లా అధ్యక్షులు గడ్డం కేశవమూర్తి, తపాలా ఉద్యోగుల సంఘం ఆల్ ఇండియా ప్రెసిడెంట్ బొద్దున వెంకటేశ్వర్లు, వరంగల్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు వలుస సుధీర్, వరంగల్ జిల్లా పోపా అధ్యక్షులు గుండు కామేశ్వర్ రావు, చేనేత కళాకారుడు అవార్డు గ్రహీత పిట్ట రాములు, ది వీవర్స్ ట్రస్ట్ బోర్డు కోశాధికారి గజ్జెల్లి రవిందర్, ఫ్రూట్ మార్కెట్ కమిటీ అధ్యక్షులు వెల్ది సాంబయ్య, రాజమౌళి పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వరంగల్ రెడ్ క్రాస్ చైర్మన్‌గా భేతి అశోక్ బాబు

- నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవం
- కమిటీకి పలువురి అభినందనలు

2





## అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హనుమకొండ, ఆయుధం:** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో, హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ రవి వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు సమర్పించిన అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పెండింగ్ లో లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. గురుకుల హాస్టల్స్, ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు కావలసిన ప్రతిపాదనలను సంక్షేమ శాఖల స్పెషల్ అధికారులు సత్వరమే అందజేయాలన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదు కోసం పట్టభద్రులైన ఓటర్లు ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 136 అర్జీలను ప్రజలు అందజేయగా హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాల్లో 38 అర్జీలు, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 135 అర్జీలు ( మొత్తం 309 ) వచ్చాయి. ఈ ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల జిల్లా ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## శాస్త్రీయ విద్యా విధానం కోసం పోరాడాలి

- విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి
- విద్యార్థులు భగత్ సింగ్ వారసులుగా ఎదగాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- హనుమకొండలో వేలాది మందితో విద్యార్థి మహా ప్రదర్శన







**హనుమకొండ, ఆయుధం:** శాస్త్రీయ విద్యా విధానం కోసం విద్యార్థులు పోరాడాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 90వ వార్షికోత్సవాల సందర్భంగా సోమవారం హనుమకొండలో వేలాది మంది విద్యార్థులతో మహా ప్రదర్శన నిర్వహించారు. స్థానిక పబ్లిక్ గార్డెన్ నుండి ప్రారంభమైన విద్యార్థి ప్రదర్శన కేయూ క్రాస్ రోడ్ మీదుగా కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియం వరకు కొనసాగింది. అనంతరం యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగిన ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవం బహిరంగ సభలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 90 ఏండ్ల చరిత్ర ఏ విద్యార్థి సంఘానికి లేదని, స్వాతంత్ర్య ఉద్యమంలో పురుడు పోసుకుని దేశ స్వాతంత్ర్యం, దేశ భద్రత, శాస్త్రీయ విద్య లక్ష్యాలుగా చదువుతూ పోరాడు.. చదువుకై పోరాడు అన్న నినాదం ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావం జరిగిందని తెలిపారు. కమ్యూనిస్టు భావజాలాన్ని పునికిపుచ్చుకున్న కామ్రేడ్ షహీద్ భగత్ సింగ్ వారసత్వంతో ఏఐఎస్ఎఫ్ పుట్టిందని, దేశంలో ప్రథమ విద్యార్థి సంఘం అయిన ఏఐఎస్ఎఫ్ లో నెహ్రూ, అటల్ జీ లాంటి వారు పని చేశారని తెలిపారు. నాటి నుండి నేటి వరకు ఏఐఎస్ఎఫ్ శాస్త్రీయ విద్యా విధానం కోసం పోరాడుతున్నదని, ఏఐఎస్ఎఫ్ లో పని చేసిన వారు ఎంతో మంది ఉన్నత స్థాయికి ఎదిగారని చెప్పారు. నేడు విద్యా రంగం పలు సమస్యలను ఎదుర్కొంటున్నదని, విద్యార్థి లోకాన్ని నిర్వీర్యం చేసేలా పాలకుల విధానాలు కొనసాగుతున్నాయని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యా రంగంలో కాషాయీకరణ చొప్పిస్తూ విద్యార్థులలో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నదని విమర్శించారు. విద్యా కాషాయీకరణకు వ్యతిరేకంగా విద్యార్థి లోకం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అలాగే విద్యార్థుల నుండి రేపటి నవతరం నాయకులు తయారు కావాలని, అందుకు విద్యా సంస్థలలో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలన్నారు.

**పాలకుల విధానాలను మార్చే శక్తి విద్యార్థులదే: దినేష్ సిరంగి రాజన్**

భారత రాజకీయాల్లో పాలకుల విధానాలను మార్చే శక్తి విద్యార్థులదేనని ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ సిరంగి రాజన్ అన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఫాసిస్ట్ పాలన కొనసాగిస్తూ విద్యార్థుల హక్కులను కాలరాస్తున్నదని విమర్శించారు. చివరకు ఎన్నికల కమిషన్ ను ప్రయోగించి విద్యార్థి, యువ జనుల ఓటు హక్కును దోచుకుంటున్నారని ఆరోపించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎన్నికల కమిషన్ ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ ను ఆ పదవి నుండి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు.



## బతుకమ్మ, దసరా కు పకడ్బందీ ఏర్పాట్లు

- బల్దియా కమిషనర్ టి. వెంకన్న

**వరంగల్, ఆయుధం:** అక్టోబర్ 10వ తేదీ నుంచి బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, గతంలో మాదిరిగానే నగరంలోని ఆయా ప్రాంతాల్లో సద్దుల బతుకమ్మ, దసరా పండుగల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి .వెంకన్న అధికారులను ఆదేశించారు. సోమవారం జీడబ్ల్యుఎంసి ప్రధాన కార్యాలయంలో బతుకమ్మ, దసరా పండుగల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జీడబ్ల్యూఎంసి పరిధిలోని 66 డివిజన్లలో బతుకమ్మ వేడుకలు జరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. బతుకమ్మ వేడుకలు నిర్వహించే ప్రదేశాల్లో రోడ్ల మరమ్మతులు, డస్టింగ్, విద్యుద్దీకరణ, గుర్రపు డెక్క తొలగింపు, పారిశుధ్య నిర్వహణ, మంచినీటి తదితర సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న బతుకమ్మ విగ్రహాలకు అవసరమైన పెయింటింగ్, పరిసరాల పరిశుభ్రత, లైటింగ్ వంటి పనులను ముందుగానే (మిగతా 2 లో..)



# ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

**వరంగల్, ఆయుధం:** టీపీయూఎస్, టీపీఆర్‌యూఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో స్వర్గీయ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతిని ఘనంగా నిర్వహించారు. బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బాపూజీ కి కేంద్ర ప్రభుత్వం భారతరత్న బిరుదు ఇవ్వాలని, అలాగే వరంగల్ జిల్లాలో కొత్తగా నిర్మించబోయే విమానాశ్రయానికి బాపూజీ పేరు పెట్టాలని ప్రభుత్వాలను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి దేవులపల్లి సాయిరాజ్, ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డ్ ప్రధాన కార్యదర్శి దాసరి ప్రేమ్ సాగర్, టీపీయూఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రపు రాజమౌళి, సహాధ్యక్షులు బొద్దున వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు కొండా శ్రీనివాస్, కోశాధికారి బూర తిరుపతయ్య, ప్రచార కార్యదర్శి కోడూరి రమేష్, గడ్డం రాజ్ కుమార్, సిరిపురం శేఖర్, వడ్నాల వెంకటస్వామి, ములుక శ్రీనివాస్, TPRUS జిల్లా అధ్యక్షులు బిట్ల వెంకటేశ్వర్లు, కార్యదర్శి గుండు కామేశ్వరరావు, నాయకులు పాశికంటి చంద్రశేఖర్, గజ్జెల్లి రవీందర్, గుర్రపు సుధాకర్ రావు, పడాల సోమయ్య, చిమ్మని రాజన్ బాబు, కొండాబత్తుల రాజేంద్రం, దేవులపల్లి సదానందం, ఆముదాల భాస్కర్, గొల్లపల్లి విద్యాసాగర్, గజ్జెల్లి కోటేశ్వర రావు, ములక సాంబయ్య, ఎలగం నరసయ్య తదితరులు పాల్గొన్నారు.




పద్మశాలి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో..

## ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి

**హనుమకొండ, ఆయుధం:** తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యాలయములో ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ 111 వ జయంతి కార్యక్రమము భాసబత్తిని రాజేషం, రాష్ట్ర అధ్యక్షులు, పద్మశాలి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్వర్యంలో జరిగినది. తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం సభ్యులు, తెలంగాణ పద్మశాలి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సభ్యులు, పద్మశాలి కులబాంధవులు హాజరై కొండ లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు, పద్మశాలిలకు చేసిన సేవలు కొనియాడుతూ వారి సందేశాలను స్మరించుకున్నారు. పద్మశాలి కులస్థులకు ఈ సంఘం ద్వారా వారి అభివృద్ధి మరియు ఐక్యతకు కృషి చేస్తూ సంఘం బలోపేతానికి తోడ్పడాలని కోరినారు. కార్యక్రమమునకు భాసంతి రాజేషం, అధ్యక్షులు, రాష్ట్ర పద్మశాలి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం, రాపోలు సోమేశ్వర్, రాష్ట్ర కోశాధికారి TPUS, గోక నాగేశ్వర్ రావు, రాష్ట్ర ఆఫీస్ సెక్రటరీ టీపీయూఎస్, ఇప్పకాయల విష్ణుమూర్తి ఆర్గనైజింగ్ సెక్రటరీ, వడ్డేపల్లి నర్సింగ్ రావు, అధ్యక్షులు, తెలంగాణ పద్మశాలి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం హైదరాబాద్ కమిటీ, వంగరి వాసుదేవ్, ప్రధాన కార్యదర్శి, తెలంగాణ పద్మశాలి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం హైదరాబాద్ కమిటీ, తిరుమల విజయ లక్ష్మి, తిరుమల వెంకట్రాములు, డాక్టర్ రమ శ్రీదేవి, జాయింట్ సెక్రటరీ, టీపీయూఎస్ హైదరాబాదు విభాగము. యం.జనార్ధన్, బి.శ్రీరాములు, యాదగిరి, వడ్డేపల్లి శ్రీనివాస్ రావు, పద్మశాలీలు పాల్గొన్నారు.




# వేలాది మందితో విద్యార్థి మహా ప్రదర్శన

**హనుమకొండ, ఆయుధం:** ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాల సందర్భంగా హనుమకొండలో వేలాది మంది విద్యార్థులతో మహా ప్రదర్శన నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల మొదటి రోజు సోమవారం హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ నుండి కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియం వరకు ఈ ప్రదర్శన కొనసాగింది. వివిధ విద్యా సంస్థల నుండి విద్యార్థులు, ఏఐఎస్ఎఫ్ కార్యకర్తలు భారీగా తరలి రావడంతో ప్రదర్శన విద్యార్థుల నినాదాలతో హోరెత్తింది. అనంతరం కేయూ ఆడిటోరియంలో జరిగిన సభలో ప్రజానాట్యమండలి కళాకారులు విద్యార్థులను ఉత్తేజ పరుస్తూ పాటలు పాడారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కసిరెడ్డి మణికంట రెడ్డి, పుట్టా లక్ష్మణ్, రాష్ట్ర యూనివర్సిటీల ఇంచార్జ్ రెహమాన్, హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉట్కూరి ప్రణీత్ గౌడ్, బాషబోయిన సంతోష్, వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిడ్డి పార్థసారథి, ల్యాదెల్ల శరత్ తదితరులు పాల్గొన్నారు.




# ఏఐఎస్ఎఫ్ తొంబై ఏండ్ల పాట ఆవిష్కరణ

**హనుమకొండ, ఆయుధం:** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 90వ వార్షికోత్సవాల సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు రచించిన ఏఐఎస్ఎఫ్ 90 ఏండ్ల పాటను సోమవారం విడుదల చేశారు. ఏఐఎస్ఎఫ్ వార్షికోత్సవాల బహిరంగ సభ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేతుల మీదుగా పాట సీడీని ఆవిష్కరించారు. ఈ పాటను ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా బృందం గానం చేసింది. ఈ కార్యక్రమంలో తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో పాటు సిపిఐ జిల్లా నాయకులు, ఏఐఎస్ఎఫ్ జాతీయ, రాష్ట్ర నాయకులు, ప్రజానాట్యమండలి కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ రెడ్ క్రాస్ చైర్మన్‌గా భేతి అశోక్ బాబు



**వరంగల్, ఆయుధం:** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, వరంగల్ జిల్లా కమిటీకి సోమవారం జరిగిన ఎన్నికలలో చైర్మన్‌గా భేతి అశోక్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే వైస్ చైర్మన్‌గా శానబోయిన రాజకుమార్, ట్రెజరర్‌గా బొల్లం శివ, స్టేట్ ఎంసీ మెంబర్‌గా నాడెం శాంతి కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ మెంబర్లు గా కుసుమ సత్యనారాయణ (రిటైర్డ్ తహసీల్దార్) తోట సంపత్ (రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు), మండల పరుషరాములు (ఎన్‌జీఓ), మామిడాల రమేష్ బాబు (అడ్వకేట్), వద్ది రాజు (టీఎన్‌జీవో), చొప్పరి సోమయ్య (ఎన్‌జీవో), ముల్క ప్రసాద్, పుల్లూరి వేణు (న్యాయవాది), డాక్టర్ విద్యాసాగర్ రెడ్డి, మోతె తిరుపతి రెడ్డి, డాక్టర్ గజవెల్లి రాజకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్, ఇతర పదవుల ప్రతినిధులకు పలువురు అభినందనలు తెలియజేశారు. అలాగే ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, వరంగల్ జిల్లా ప్రెసిడెంట్ /కలెక్టర్ డాక్టర్ సత్యశారద ని మర్యాద పూర్వకముగా కలిశారు.

# ప్రభుత్వ భూములకు హద్దులు ఏర్పాటు చేయాలి

- **ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి**
- **జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**



**కాజీపేట, ఆయుధం:** ప్రభుత్వ భూముల పరిరక్షణకు అధికారులు సమన్వయంతో తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. కాజీపేట మండలం మడికొండ గ్రామంలో క్రైస్తవ, ముస్లిం మతస్తులకు స్మశాన వాటికల కేటాయింపునకు ప్రతిపాదించిన స్థలాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ పరిశీలించారు. స్థలానికి సంబంధించిన వివరాలు, భూమి విస్తీర్ణం, అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమి తదితర అంశాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్మశాన వాటిక కేటాయింపునకు సంబంధించి అవసరమైన స్థల పరిశీలన, రికార్డుల పరిశీలన పూర్తి చేసి, అవసరమైన ప్రతిపాదనలను నిబంధనల ప్రకారం సమర్పించాలని ఆర్డీఓ వెంకటేష్, కాజీపేట తహసీల్దార్ రాజును జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా వాటి పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ప్రభుత్వ భూములకు సంబంధించిన ఖాళీ ప్రదేశాలను గుర్తించి, వాటి చుట్టూ స్పష్టమైన హద్దులు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల వివరాలను రికార్డులతో క్షేత్రస్థాయిలో సరిపోల్చి పరిశీలించాలని, ప్రభుత్వ భూములపై అనధికార ఆక్రమణలు జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే గుర్తించిన ప్రభుత్వ భూముల పరిరక్షణకు అవసరమైన చర్యలను ప్రాధాన్యతతో చేపట్టాలని తెలిపారు. ప్రజా అవసరాల కోసం ప్రభుత్వ భూములను కేటాయించే సందర్భంలో భూమి స్థితిగతులు, రికార్డులు, స్థల అనుకూలత తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి, అవసరమైన ప్రతిపాదనలను త్వరితగతిన సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ స్థల పరిశీలన కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, కాజీపేట తహసీల్దార్ రాజు, రెవెన్యూ అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్తవాడ చేనేత మగ్గాలను పరిశీలించిన సీపీ శ్వేత



**వరంగల్, ఆయుధం:** చేనేతపై ప్రత్యేక అభిమానం చూపుతూ, స్థానిక చేనేత ఉత్పత్తులను ప్రోత్సహిస్తున్న వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత ఐపీఎస్ కొత్తవాడ చేనేత మగ్గాలను సందర్శించి, చేనేత కార్మికుల పనితీరును స్వయంగా పరిశీలించారు. వరంగల్ జిల్లాలో పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం వరంగల్ నగర ప్రత్యేకతను చాటే, భౌగోళిక గుర్తింపు (జీఐ) పొందిన కొత్తవాడ కార్పెట్స్‌ను ఆమె స్వయంగా పరిశీలించి, వాటి చరిత్ర, తయారీ విధానం గురించి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు నేత ఆధ్వర్యంలో సీపీ శ్వేత కొత్తవాడకు విచ్చేసి చేనేత మగ్గాలను పరిశీలించారు. చేనేత తయారీలోని వివిధ దశలైన నూలు పట్టడం, కండెలు చుట్టడం, అచ్చు అతకడం, మగ్గం నేయడం తదితర ప్రక్రియల గురించి కార్మికులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉత్పత్తి అయ్యే కొత్తవాడ కార్పెట్స్, శాయంపేట టవల్స్, లుంగీలు, బెడ్‌షీట్లు, మహదేవ్‌పూర్ దస్రు పట్టు చీరలు, జనగాం ఇక్కత్ పట్టు చీరలు వంటి వివిధ చేనేత ఉత్పత్తులను ప్రత్యేకంగా తెప్పించుకుని వాటి నాణ్యతను పరిశీలించారు.

రిటైర్‌మెంట్ రోజున చేనేతకు ప్రాధాన్యం

ఈ సందర్భంగా టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు నేత చేసిన విజ్ఞప్తికి సీపీ శ్వేత సానుకూలంగా స్పందించారు. ఇకపై పోలీసు సిబ్బంది రిటైర్‌మెంట్ కార్యక్రమాల్లో సాధారణంగా అందించే శాలువాకు బదులుగా చేనేత టవల్‌తో పాటు ఒక పూజా మ్యాట్‌ను అందించాలని అంగీకరించారు. ఇందుకు అనుగుణంగా పోలీస్ డిపార్ట్‌మెంట్ ద్వారా వాటిని కొనుగోలు చేసి తీసుకెళ్లారు. గతంలో సిద్దిపేట ఎస్పీగా పనిచేసిన సమయంలో అక్కడ తయారయ్యే చేనేత గొల్లభామ చీరలు, శాలువాలను కొనుగోలు చేసి ఉన్నతాధికారులు, బంధువులు, స్నేహితులకు బహుమతులుగా అందిస్తూ చేనేతను ప్రోత్సహించినట్లు సీపీ శ్వేత తెలిపారు.
వరంగల్ జిల్లాలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం కూడా స్థానిక చేనేత ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ చేనేత కార్మికులకు అండగా నిలుస్తున్నారని చిప్ప వెంకటేశ్వర్లు నేత పేర్కొన్నారు. సీపీ శ్వేత మేడంను ఆదర్శంగా తీసుకుని జిల్లాలోని ఇతర అధికారులు కూడా స్థానిక చేనేత ఉత్పత్తులను ఆదరించి, చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని చిప్ప వెంకటేశ్వర్లు కోరారు. ఈ కార్యక్రమంలో అడిగొప్పుల సంపత్, దువ్వల రాజేందర్, యెలుగం సాంబయ్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ, దసరాకు
# పకడ్బందీ ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి..)
పూర్తి చేయాలని తెలిపారు.
ఇటీవల నిర్వహించిన గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసిన తీరును కమిషనర్ అభినందించారు. అదే స్ఫూర్తితో బతుకమ్మ, దసరా పండుగలకు కూడా పకడ్బందీగా ఏర్పాట్లు చేసి విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. దసరా పండుగ రోజున ప్రజలు అధికంగా వచ్చే ఉర్సు గుట్ట, సిద్ధేశ్వర ఆలయం, రంగసాయిపేట తదితర ప్రాంతాల్లో గతంలో మాదిరిగానే ఇతర శాఖల అధికారుల సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో పారిశుధ్యం, రహదారులు, విద్యుద్దీకరణ, మంచినీటి సౌకర్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బతుకమ్మ, దసరా పండుగలను పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణంలో ప్రజలు ఆనందంగా జరుపుకునేలా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా కమిషనర్ ఆదేశించారు. ఈ సమావేశంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్ కుమార్, సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి డి ఎఫ్ ఓ శంకర్ లింగం, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, సి హెచ్. ఓ లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి పాల్గొన్నారు.



# అంగన్‌వాడీ టీచర్ల, ఆశా వర్కర్ల సేవలు అభినందనీయం

**- బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్.**

**వరంగల్, ఆయుధం:** ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా మహిళా మోర్చా నాయకురాలు మార్తా ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన అంగన్ మిలన్ సేవా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, మహిళా మోర్చా జిల్లా ఇంచార్జీ సిరికొండ కవిత, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు టేకుమట్ల రేణుక, మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివనగర్‌లోని అంగన్వాడీ కేంద్రం టీచర్లు, ఆయా వర్కర్ల సేవలను అభినందిస్తూ బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ వారిని శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ.. నిరంతరం చిన్నారుల ఆరోగ్యం, ప్రాథమిక విద్య కోసం పాటుపడుతున్న అంగన్వాడీ సిబ్బందికి ప్రధాని మోదీ పంపిన ప్రత్యేక అభినందనలు తెలిపి వారిని గౌరవించారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి రేపల్లె స్వర్ణజ, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు శెట్టి స్రవంతి, మహిళా నాయకులు తోట సాగరిక, జారతి దేవక్క, స్వరూప, లావణ్య, బిజెపి జిల్లా నాయకులు బైరి శ్యాంసుందర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు మదాసు రాజు, బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్, మండల నాయకులు బోడకుంట్ల శివశంకర్, TVLN శ్రీనివాస్, పోశాల సతీష్ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను గడువులోగా పరిష్కరించాలి

- **బల్దియా కమిషనర్ టి. వెంకన్న**
- **ప్రజావాణిలో 92 దరఖాస్తుల స్వీకరణ**



**వరంగల్, ఆయుధం:** ప్రజల నుంచి స్వీకరించే ప్రతి ఫిర్యాదును బాధ్యతతో పరిశీలించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుంచి 92 దరఖాస్తులను స్వీకరించారు. ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య స్వభావాన్ని బట్టి సంబంధిత విభాగాలకు బదలాయించి, త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, అనవసర జాప్యాన్ని ఎంతమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. అనంతరం గత వారం ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల విభాగాల వారీగా పరిష్కార స్థితిగతులను కమిషనర్ సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించడంతో పాటు, చేపట్టిన చర్యలను సంబంధిత ఫిర్యాదుదారులకు తెలియజేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం జరిగితే సంబంధిత అధికారులు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సూపరింటెండింగ్ ఇంజినీర్ రాజ్‌కుమార్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డీఎఫ్ఓ శంకర్‌లింగం, సీహెచ్ఓ లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, సమ్మయ్య, సెక్రటరీ అనిల్‌బాబు, పన్నుల అధికారి రామకృష్ణతో సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రీ ప్రైమరీ విద్యతో చిన్నారులకు బంగారు భవిష్యత్

- **సర్పంచ్-బండి రేణుక శంకర్**



**నడికూడ, ఆయుధం:** చర్లపల్లి ప్రాథమిక పాఠశాల ప్రీ ప్రైమరీలో చేరిన చిన్నారులకు గ్రామ సర్పంచ్ బండి రేణుక శంకర్ చిన్నారులకు వర్క్‌బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బండి రేణుక శంకర్ మాట్లాడుతూ, చిన్నారుల విద్యాభ్యాసానికి ప్రీ ప్రైమరీ విద్య ఎంతో ఉపయోగకరమని అన్నారు. చిన్న వయసులోనే పిల్లల్లో చదువు పట్ల ఆసక్తి, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెంపొందించేలా ప్రీ ప్రైమరీ విద్య దోహదపడుతుందని తెలిపారు. ఆటలు, పాటలు, కథలు, చిత్రలేఖనం, రంగులు, అంకెలు తదితర కార్యకలాపాల ద్వారా పిల్లలకు ఆనందదాయకమైన వాతావరణంలో విద్య అందించడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి అందుబాటులో ఉన్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్, ఉపాధ్యాయులు లకావత్ దేవా, కంచ రాజు కుమార్, ప్రీ ప్రైమరీ టీచర్ బండి శ్వేత, అంగన్వాడీ టీచర్ సంధ్య, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గురుకులాల్లో విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత

**హైదరాబాద్, ఆయుధం:** రాష్ట్రంలోని పాఠశాల విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల పరిధిలోని అన్ని రెసిడెన్షియల్ విద్యాసంస్థలను పటిష్టంగా పర్యవేక్షిస్తూ, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ లోని వీసీ హాల్ నుండి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్యతో పాటు మౌలిక వసతులపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థలను క్రమం తప్పకుండా ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను ప్రత్యక్షంగా పరిశీలించాలని సూచించారు. ముఖ్యమంత్రి ఇటీవల నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు చేపడుతున్నప్పటికీ కొన్ని చోట్ల *ఫుడ్ పాయిజనింగ్, ఎలుకలు, పాముకాటు* వంటి ఘటనలు చోటు చేసుకోవడం పై ఆవేదన వ్యక్తం చేసిన విషయాన్ని సీఎస్ ప్రస్తావించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ఆహారం తయారీ, ఆహార పదార్థాల నిల్వ, వినియోగంలో నిర్దేశిత ప్రామాణిక నిర్వహణ విధానాలను తప్పనిసరిగా పాటించాలని సీఎస్ తెలిపారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత, పారిశుధ్య నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మౌలిక వసతుల లోపాలు తదితర అంశాలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు.
సాధ్యమైన చోట్ల వంటశాలల ఆధునీకరణ పనులను వీలైనంత త్వరగా చేపట్టాలని సూచించారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఉన్నతస్థాయిలో పర్యవేక్షించేందుకు రూపొందించిన డ్యాష్‌బోర్డ్‌ను కలెక్టర్లు క్రమం తప్పకుండా పరిశీలించాలని సంజయ్ జాజు తెలిపారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందుతున్నాయా లేదా, ఏవైనా లోపాలు ఉన్నాయా అనే అంశాలను పరిశీలించి, వాటి వివరాలను ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో చేపట్టిన మార్పులు, సమస్యల పరిష్కార చర్యలను కూడా పోర్టల్‌లో నిరంతరం అప్‌డేట్ చేయాలని సూచించారు.
జిల్లాలో రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు సంబంధించి ఏదైనా ప్రతికూల నివేదిక వచ్చినప్పుడు సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సీఎస్ సూచించారు. ప్రభుత్వం డైట్ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీలను పెంచి అమలు చేస్తోందని, కాస్మెటిక్ ఛార్జీలను ప్రస్తుతం డీబీటీ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. రానున్న శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు స్నానానికి వెచ్చని నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన దుప్పట్లను ముందుగానే సమకూర్చాలని సీఎస్ ఆదేశించారు.
అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ విద్యాసంస్థల భవన యజమానులతో కలెక్టర్లు సమావేశమై అవసరమైన మార్పులు, మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.
ప్రతి ఉపాధ్యాయుడికి అవసరమైన శిక్షణ అందేలా చర్యలు చేపట్టాలని సీఎస్ తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలో ప్రతిరోజూ ఒక లక్ష యూనిఫారాలు కుట్టేలా చర్యలు చేపట్టాలని, దసరా నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల కుట్టిన యూనిఫారాలు అందేలా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. యూనిఫాం క్లాత్ ఇప్పటికే జిల్లాలకు చేరినందున కుట్టు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా పర్యవేక్షిస్తూ, క్షేత్రస్థాయిలో చేపట్టిన చర్యలు, సమస్యల పరిష్కార వివరాలను ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో క్రమం తప్పకుండా నవీకరించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కలెక్టర్లను ఆదేశించారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695